నత్తే నయం..!

- మందకొడిగా సాగుతున్న ఫాంపాండ్స్ పనులు
- మండలానికి 87 నీటి కుంటలు మంజూరు
- పూర్తయినవి 47 మాత్రమే
- అవగాహన కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం
- ఆసక్తి చూపని రైతులు



పసుపల గ్రామంలో నీటి కుంట పనులు చేస్తున్న కూలీలు

బనగానపల్లె రూరల్: రైతుల పొలాల్లో నీటిని నిల్వ చేయడమే లక్ష్యంగా పంట సంజీవని పథకం అమలు చేస్తున్నారు. ఓ వైపు ఖరీఫ్ సీజన్ మొదలు కావడంతో రైతులు వివిధ పంటల సాగు చేస్తున్నారు. మరోవైపు వర్షాలు కురుస్తున్నాయి. కాలం మించిపోతున్నా బనగానపల్లె మండలంలో మాత్రం నీటి కుంట (ఫారం పాండ్స్)ల పనులు మందకొడిగా సాగుతున్నాయి. వర్షాలకు ముందే నీటికుంటల నిర్మాణం పూర్తయ్యేలా రైతులకు జాతీయ ఉపాధిహామీ పథకం యంత్రాంగం అవగాహన కల్పించాల్సి ఉంది. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీటి కుంటల నిర్మాణ లక్ష్యం నెరవేరడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. బనగానపల్లె మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో సుమారు 48 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో మొత్తం 87 నీటి కుంటల నిర్మాణం లక్ష్యంగా ఉంది. ఇప్పటి వరకు 47 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అనుకున్న లక్ష్యాన్ని ఈ నెల చివరిలోపు పూర్తి చేయాల్సి ఉన్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వర్షాలకు ముందే నీటి కుంటల నిర్మాణం పూర్తయి ఉంటే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది.

126 నుంచి 1104 పని దినాలు

రైతుల పొలంలో వర్షపు నీరు నిల్వ చేసుకునే విధంగా ఉపాధిహామీ పథకం ద్వారా ఫారంపాండ్స్ నిర్మాణాలు చేపట్టారు. కొలతల ప్రకారం ఒక్కో కుంట నిర్మాణానికి 126, 339, 666,1104 పని దినాలు కేటాయించాలి. కుంట సైజ్‌ను బట్టి నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. ఇందులో 2.83 సెంట్ల కుంటకు రూ.30,283, 5.73 సెంట్లకు రూ.70,521, 8.03 సెంట్ల కుంటకు రూ.1.32లక్షలు, 15.20 సెంట్ల కుంటకు రూ.2,14,353లను మంజూరు చేస్తుంది. మెట్ట ప్రాంతాల్లో కుంటల తవ్వకానికి ఇబ్బందిగా మారిందని కూలీలు పేర్కొంటున్నారు. కుంటలు తవ్వే పనులకు వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతోనే కూలీలు దూరంగా ఉంటున్నారని.. అందుకే లక్ష్యం నేరవేరడంలేదని పలువురు రైతులు వాపోతున్నారు. అలాగే సొంత భూమి ఉన్న రైతులు కూడా కుంటలు తవ్వించుకునేందుకు ముందుకు రావడంలేదని తెలుస్తోంది.



భానుముక్కల గ్రామంలో పూర్తయిన నీటికుంట

ఫారం పాండ్స్‌తో ప్రయోజనాలు

నీటి కుంటల్లో వర్షపు నీటిని ఒడిసి పడితే అవసరమైన సమయంలో పంటలకు నీటిని అందించవచ్చు. అలాగే పొలాల్లో పశువులు, జీవాలకు తాగునీటి సమస్య ఉండదు. ఫారంపాండ్స్‌లో చేరిన ఒండ్రు మట్టిని రైతులు ఎరువుగా వినియోగించుకోవచ్చు. ఈ నీటి ద్వారా కొంత ఆదాయానిచ్చే కూరగాయాలను పండించుకోవచ్చు. భూగర్భ జలాలు, భూసారం పెంచుకునేందుకు నీటి కుంటలు ఉపయోగపడుతాయి.

వేగవంతం చేస్తున్నాం



మండలంలో మొత్తం 87 నీటి కుంట నిర్మాణాలు లక్ష్యం కాగా పనులు చురుగ్గా సాగుతున్నాయి. నీటి కుంటల నిర్మాణాలతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. వీటిపై రైతులకు టీఏల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు 47 నీటి కుంటల నిర్మాణం పూర్తయ్యాయి. మిగిలిన కుంటలు వివిధ ధశల్లో ఉన్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు నీటి కుంటల నిర్మాణ పనులు పూర్తి చేస్తాం. –ప్రతాప్, ఏపీఓ, బనగానపల్లె

క్లుప్తంగా

హంస వాహనంపై వేంకటేశ్వరుని అభయం



హంసవాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

సంజామల: బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆదివారం నొస్సం గ్రామంలోని బుగ్గ వేంకటేశ్వరస్వామి హంస వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. హంసవాహనంపై కొలువుదీరిన స్వామివారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకుడు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



చర్చిలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న రాజారెడ్డి

బనగానపల్లె రూరల్: పట్టణంలోని ఖాజీవాడ మసీదు, క్రిస్టియన్ బ్రదరన్ అసెంబ్లిస్ ప్రార్థన మందిరాల్లో మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి తన సొంత నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఇప్పటి వరకు రూ.6 లక్షలతో నాలుగు ప్రార్థన మందిరాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న ఎంపీపీ, నాయకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటస్వామి(75) శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, గిడ్డంగుల, ఉర్దూ అకాడమీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ల మాజీ డైరక్టర్లు బాబుల్‌రెడ్డి, ముర్తుజావలి, ఖాజా ఆదివారం వెంకటస్వామి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రుడు, మురళీకృష్ణ, తిరుమలేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, ఎద్దులన్న, సర్పంచ్‌లు శ్రీరాములు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. అలాగే రంగాపురం గ్రామానికి చెందిన పాపసాని గోవిందరెడ్డి (70) అనారోగ్యంతో మృతిచెందడంతో సంతాపం తెలిపారు.

సీపీఎం నాయకులపై కేసు

బేతంచెర్ల: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కాలనీ సమీపంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తుండగా అడ్డుకుని ధ్వంసం చేసిన ఘటనలో 8 మంది సీపీఎం నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ బాబు ఆదివారం తెలిపారు. బాధితుడు హరికృష్ణ ఫిర్యాదు మేరకు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారనే అభియోగాలతో సీపీఎం నాయకులు మధుశేఖర్, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, ఖాజా, రాజు, వెంకటరమణ, నారాయణ, నాగరాజులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

కాటసాని నాగార్జునరెడ్డికి నివాళి



నాగార్జునరెడ్డి ఘాట్‌లో నివాళులర్పిస్తున్న కాటసాని దంపతులు

బనగానపల్లె: మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పెద్ద కుమారుడు నాగార్జునరెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణ సమీపంలోని ఘాట్ వద్ద ఆయన చిత్ర పటానికి కాటసాని రామిరెడ్డి, జయమ్మ దంపతులు నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ

బనగానపల్లె రూరల్: స్థానిక ఎంపీటీసీ మాజీ సభ్యుడు అబ్దుల్‌ఫైజ్ బెంగళూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో ఇటీవల కిడ్నీ స్టోన్స్ ఆపరేషన్ చేయించుకుని ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ న్యాయవాది అబ్దుల్‌ఖైర్, నాయకులు మురళి మోహన్ రెడ్డి, ఖానిక్, అంబటి రవికుమార్ రెడ్డి, అబ్దుల్‌ఫైజ్, నీలి శ్రీనివాసులు, అంజాద్ ఉన్నారు.

రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలు

- కూటమి ప్రభుత్వంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి శాంతిభద్రతలు లోపించాయని.. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దుయ్యబట్టారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దిగజారిన శాంతి భద్రతల వల్ల అరాచకాలు, దుర్మార్గాలు ఎక్కువయ్యాయన్నారు. అధికార దుర్వినియోగం, తప్పుడు కేసులు, మహిళలు బాలికలపై అఘాయిత్యాలు, వేధింపులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలను కూటమి నేతలు గాలికి వదిలేశారన్నారు.

డైవర్షన్ పాలిటిక్స్

కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 14 లక్షల కోట్లతో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రాగా కూటమి పాలనలో ఎవరూ ముందుకు రావడంలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో హామీలన్నింటినీ అమలు చేశామని గుర్తు చేశారు. అలాగే 17 మెడికల్ కాలేజీలు మంజూరుతో పాటు గ్రీన్‌కో సోలార్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపారు.

తల్లికి వందనంలో కోతలు

తల్లికి వందనం పథకంలో కూటమి ప్రభుత్వం కోతలు విధించిందని కాటసాని అన్నారు. రాష్ట్రంలో 87.42 లక్షల మంది విద్యార్థులు ఉండగా 67లక్షల మంది విద్యార్థులకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేయడం ఎంత వరకు న్యాయం అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం కింద రూ.13 అందజేసి రూ.2 వేలను ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఖర్చు పెడితే విమర్శలు చేసిన కూటమి నేతలు ఇప్పుడు అదే పనిచేస్తున్నారని తెలిపారు. నిరుద్యోగ భృతి హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామన్న హామీని పీ–4కు లింక్ చేసి చేతులు దులుపుకున్నట్లు విమర్శించారు. గత ప్రభుత్వంలో బనగానపల్లె నియోజకవర్గంలో రూ.150 కోట్లతో ఇంటింటి కొళాయి కనెక్షన్ ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, అంబటి రవికుమార్‌రెడ్డి, సాదుల మురళిమోహన్‌రెడ్డి, నీలిశ్రీనివాసులు ఉన్నారు.

కంపమల్లలో కార్డన్‌సెర్చ్



గ్రామసభలో మాట్లాడుతున్న సీఐ

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్లలో ఆదివారం కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో సోదాలు చేయగా ఎలాంటి మారణాయుధాలు లభ్యం కాలేదు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామసభలో సీఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. గ్రామస్తులు ఐకమత్యంతో మెలగాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే సామరస్యంగా పరిష్కరించుకోవాలని.. అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల, రేవనూరు, సంజామల ఎస్ఐలు మల్లికార్జునరెడ్డి, భూపాలుడు, రమణయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం



సచివాలయం చుట్టు పేరుకుపోయిన కంపచెట్లు

ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. అయితే కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ వ్యవస్థ నీరుగారుతోంది. సంజామల మండలం కమలపురి గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో గ్రామ సచివాలయం ఏర్పాటు చేశారు. సచివాలయం పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. సచివాలయ ఆవరణలో పిచ్చిమొక్కలు, కంపచెట్లు మొలవడంతో అడవిని తలపిస్తోంది. సచివాలయాన్ని ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి సచివాలయాన్ని ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు. –సంజామల

వర్షం.. రైతన్న హర్షం



కోవెలకుంట్లలో కురుస్తున్న వర్షం



భీమునిపాడు సమీపంలో రోడ్డుపై కూలిన చెట్టు

కోవెలకుంట్ల: ఉపరితల ద్రోణి ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్‌డివిజన్‌లో ఆదివారం సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు వర్షం ఊపిరిపోసింది. ఈ నెల 1వ తేదీ నుంచి ఖరీఫ్ ప్రారంభం కాగా ఆయా మండలాల పరిధిలో రైతులు మొక్కజొన్న, పత్తి, మినుము, కంది, పెసర, ఆముదం, తదితర పంటలు సాగు చేశారు. పైర్లు మొలక దశలో ఉండగా కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, అవుకు మండలాల్లో ఆశించిన స్థాయిలో వర్షం కురవడంతో రైతులు ఊరట చెందుతున్నారు. వర్షం సాగు చేసిన పంటలతోపాటు సాగు చేయాల్సిన పంటలకు అనుకూలంగా మారడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భీమునిపాడు సమీపంలోని కోవెలకుంట్ల– ఆళ్లగడ్డ ఆర్అండ్‌బీ రహదారిలో గాలివాన బీభత్సానికి చెట్టు కూలి రోడ్డుపై అడ్డంగా పడింది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కొలిమిగుండ్లలో మోస్తరు వర్షం

కొలిమిగుండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. కాగా ఆయా గ్రామాల్లోని చెరువులు పూర్తిగా ఎండిపోవడంతో భారీ వర్షపాతం కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొనడంతో రామ్‌కో, అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీల సహకారంతో ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నారు. నైరుతి ముందస్తు వచ్చినా నిరాశ పరుస్తోంది. భారీ వర్షం కురిసి చెరువులు సమృద్ధిగా నిండితే సాగు, తాగునీటి సమస్య తొలగిపోతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

సీపీఎం నుంచి బహిష్కరణ

డోన్ టౌన్: సీపీఎంలో ఉంటూ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న మండల కార్యదర్శి కొయిలకొండ నాగరాజుతో పాటు తారకరామనగర్‌శాఖ కార్యదర్శి అక్బర్‌బాషాలను పార్టీ నుంచి బహిష్కరించినట్లు ఆ పార్టీ జిల్లా సభ్యుడు నక్కి శ్రీకాంత్, సీనియర్ నాయకుడు శివరామ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం డోన్ పార్టీ కార్యాలయంలో వెల్లడించారు. ఇకపై పార్టీకి వారితో ఎలాంటి సంబంధం లేదన్నారు.

మంచినీటి సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్: ఈదుల దేవరబండ– బండగట్టు గ్రామల మధ్య ఉన్న గాజులదిన్నె ప్రాజెక్టు పైప్‌లైన్‌కు లీకేజీ పనుల కారణంగా 16, 17 తేదీల్లో పట్టణంలో మంచి నీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. 18వ తేదీ నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

డోన్ టౌన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ అడ్మిషన్స్ కోర్డినేటర్ హరిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్, లైఫ్, వర్క్ ప్లేస్ ఎథిక్స్ తదితర విభాగాల్లో 35 రోజుల పాటు భోజన వసతి సదుపాయాలతో శిక్షణ ఇస్తామన్నారు. 18 ఏళ్ల నిండి పది ఆపై చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 90004 87423 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ నేత రామచంద్రయ్య

డోన్ టౌన్: ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. మార్కెట్ యార్డ్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఐ పేద బడుగుబలహీన వర్గాలకు అండగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయకుండా పోరాటాలు చేస్తామన్నారు. డోన్‌లో జరగనున్న సీపీఐ జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల్లో అలజడి సృష్టిస్తే జైలు జీవితమే



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

బేతంచెర్ల: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో సమస్యలను సృష్టిస్తే శాశ్వతంగా జైలు జీవితం గడపాల్సి వస్తుందని సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ల్లో ఎస్ఐ రమేష్ బాబుతో కలిసి మండలంలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. స్నేహపూర్వక వాతావరణంలో జీవనం కొనసాగించాలన్నారు. గొడవలకు దిగినా, అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థి సంఘాల పేరుతో దౌర్జన్యాలు సరికాదు



సీఐకి వినతి పత్రం అందజేస్తున్న ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ సభ్యులు

బేతంచెర్ల: విద్యార్థి సంఘాల పేరుతో దౌర్జన్యాలు చేయడం సమంజసం కాదని అపుస్మా జిల్లా అధ్యక్షుడు బిజ్జం సుబ్బారెడ్డి అన్నారు. విద్యార్థి సంఘాల పేరుతో దౌర్జన్యాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆదివారం సీఐ వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏఐఎస్ఎఫ్ నాయకుడినంటూ ఉదయ్ అనే వ్యక్తి బేతంచెర్ల ప్రైవేట్ స్కూల్ యాజమన్యాలను బెదిరిస్తూ నగదు డిమాండ్ చేస్తున్నాడని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు రక్షణ కల్పించాలని సీఐను కోరారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి



మాట్లాడుతున్న శివన్న

డోన్ టౌన్: ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని.. విద్యాహక్కు చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శివన్న డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో ఆయన మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో అరకొర వసుతులు కల్పించి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యా హక్కు చట్టం ద్వారా ఉచిత సీట్లు పొందిన వారి నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. స్కూళ్లపై విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ ఉండాలని కోరారు. సంఘం సభ్యులు అశోక్ కుమార్, రవి, మనోజ్ తదితరులు ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



గురువును సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్ టౌన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆదోనికి చెందిన యోగా గురూజీ వేణుగోపాల్, డోన్ గీతా యోగాసన సంఘం గురూజీ రాంపుల్లయ్య, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. కేవీఎస్ పార్క్‌లోని గీతా యోగాసన సంఘం సభ్యులకు రెండు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన వేణుగోపాల్‌ను కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో గీతా యోగాసన సంఘ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

నీట్‌లో మెరిసిన గ్రామీణ విద్యార్థులు

బేతంచెర్ల: నీట్ ఫలితాల్లో గ్రామీణ ప్రాంత విద్యార్థులు సత్తాచాటారు. తల్లిదండ్రుల కష్టాన్ని వమ్ము చేయకుండా మంచి మార్కులు సాధించారు. బేతంచెర్ల మండలంలోని సీతారామాపురం, ఆర్ఎస్ రంగాపురం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.

సర్పంచ్ కుమారుడి సత్తా



చిట్టి శశాంత్‌రెడ్డి

మండలంలోని సీతారామాపురం సర్పంచ్ చిట్టి వేణుగోపాల్ రెడ్డి, నర్సింగ్ అధ్యాపకురాలు రజిత దంపతుల కుమారుడు శశాంక్ రెడ్డి నీట్ ఫలితాల్లో 577 మార్కులు సాధించాడు. ఆలిండియా ర్యాంకు 4900, క్యాటగిరి ర్యాంక్ 2300తో సత్తా చాటాడు. ఇంటర్‌లో 980 మార్కులు సాధించాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే మంచి మార్కులు సాధించగలిగానని విద్యార్థి తెలిపాడు. వైద్య విద్య పూర్తి చేసి పేదలకు సేవ చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు.

లారీ డ్రైవర్ కుమారుడి ప్రతిభ



బోయిని భరత్ కుమార్

హుసేనాపురం గ్రామానికి చెందిన బోయిని సుంకన్న, లక్ష్మీదేవమ్మ దంపతుల కుమారుడు భరత్‌కుమార్ నీట్‌లో 497 మార్కులు సాధించాడు. ఆలిండియా ర్యాంక్ 55,310, క్యాటగిరి 26,485 ర్యాంక్ తెచ్చుకున్నాడు. లారీ డ్రైవర్ అయిన తండ్రి కష్టాన్ని గుర్తించి చదువుకున్నట్లు విద్యార్థి తెలిపాడు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు కష్టం కలగకుండా చూసుకుంటానని చెప్పాడు.

18న మండల మీట్

అవుకు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 18వ తేదీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంగన్న తెలిపారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. అవుకు మండలంలోని గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు, జరగాల్సిన పనులపై చర్చ ఉంటుందన్నారు.